క్లుప్తంగా

భూ ఆక్రమణలపై ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం అందిస్తునన నేతలు

తిరుపతి అర్బన్ : వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలంలో భూ ఆక్రమణలపై గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జున్ ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సాల్‌కు వినతిపత్రం అందించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని గిరిజనులకు పంపిణీ చేయాలని కోరారు. అత్తూరు చెంగల్రాయులు, కల్పన పాల్గొన్నారు.

అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు చేపట్టనున్న మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమాల పోస్టర్‌ను ససోమవారం ఆవిష్కరించారు. వర్సిటీలో వీసీ ఛాంబర్‌లో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రొఫెసర్ మురళీధర్, కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ



మహిళలకు ముడి సరుకులు అందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రాస్ జన శిక్షణ సంస్థ వారు శివజ్యోతినగర్‌లో మహిళలకు సోమవారం బ్యూటీషిన్ కోర్సులో శిక్షణ తరగతులను ప్రారంభించారు. జన శిక్షణ డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధికి చేతి వృత్తులను నేర్చుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. రాస్ ఫీల్డ్ అధికారి బాలాజీ మాట్లాడుతూ మూడు నెలలపాటు కొనసాగే ఈ కోర్సులో శిక్షణ పొందిన వారికి రుణాలు ఇప్పించి సాయం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం కోర్సుకు సంబంధించిన ముడి సరుకులు అందజేశారు. సుధాకర్‌రెడ్డి, గీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సీపీఐ డివిజన్ కార్యదర్శుల ఎంపిక



అల్లాబక్షు



దాము

తిరుపతి కల్చరల్ : సీపీఐ మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం నగరంలోని 16, 17వ డివిజన్లకు పార్టీ కార్యదర్శులుగా అల్లాబక్షు, దామును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆయా డివిజన్లలో పార్టీ జెండా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. త్యాగాలతో కూడిన ఎర్రజెండా గొప్పతనం వివరించారు. నూతన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



ఈఓకు ట్రోఫీని చూపుతున్న క్రీడాకారులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలను ఈఓ శ్యామలరావు అభినందించారు. జట్టు కెప్టెన్ చీర్ల కిరణ్ సోమవారం టీటీడీ పరిపాలన భవనంలో ఈఓను కలిశారు. రమేష్, సుబ్రహ్మణ్యం, రవి కుమార్ రెడ్డి, చిరంజీవి, బాలాజీ, సునీల్, గోపి, చైతన్య, మురళి పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై నిరసన



మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

తిరుపతి అర్బన్ : ప్రాథమిక పాఠశాలల విలీనంపై సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు నేతృత్వంలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నాగరాజు మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించమని కోరితే అధికారులు చేతులెత్తేశారని మండిపడ్డారు. విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశా రు. నేతలు సుబ్రమణ్యం, రవి, శ్యామల పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

తిరుపతి రూరల్ : మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం స్పెషల్ డ్రైవ్ కింద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రహదారులకు ఇరువైపులా చెత్తాచెదారాలను జేసీబీలతో తొలగించారు. చిగురువాడ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో చెత్తవేయరాదు అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

జబ్బార్‌లేవుట్‌లో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి 3వ డివిజన్‌లో..



నయవంచనే బాబు నైజం

- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించిన అభినయ్‌రెడ్డి
- ఏడాదిగా ఒక్క పథకం కూడా అమలు చేయలేదని ప్రజల ఆక్రోశం
- కూటమి నేతలను చొక్కా పట్టుకుని నిలదీస్తామని ఆగ్రహం

"ఏమక్కా ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయా..? ఆయన చెప్పిన సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం అందిందా...? ప్రతి నెలా ఆడబిడ్డ నిధి కింద రూ.1,500లు ఇస్తున్నారా..? 20లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తానన్నారు ఒక్కరికైనా వచ్చిందా..? నెలనెలా రూ.3వేల నిరుద్యోగ భృతి అన్నారు.. ఒక్కరికైనా ముట్టిందా..? రైతులకు అన్నదాతా సుఖీభవ కింద రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అని ఊరించారు.. ఒక్కరి ఖాతాలో అయినా నగదు జమ చేశారా..? ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అంటూ గొప్పలు చెప్పుకున్నారు.. అందరికీ వచ్చాయా..? ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారా..?'" అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై నగరవాసులను వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.

తిరుపతి మంగళం : చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ వివరించారు. సోమవారం నగరంలోని 1వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం గ్రామంలో, 26వ డివిజన్ జబ్బార్‌లేఅవుట్, 3వ డివిజన్ మార్టిన్ స్కూల్, 21వ డివిజన్ శాంతినగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. బాబు మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. అభినయ్ వెల్లడించిన వాస్తవాలను నగరవాసులు అంగీకరించారు. చంద్రబాబు వంటి నయవంచకుడు ప్రపంచంలోనే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతల సంక్షేమ పథకాలు అందిస్తానంటూ నమ్మించి మోసం చేశాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కూటమి నేతలు మా ఇళ్ల వద్దకు వచ్చి ఏమ్మా మీ వార్డులో సమస్యలేమైనా ఉన్నాయా? ప్రభుత్వ పథకాలు వస్తున్నాయా? అని అడిగిన పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎవరైనా కూటమి నేతలు మా ఇళ్ల వద్దకు వస్తే చొక్కా పట్టుకుని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబుకు ఓట్లు వేసినందుకు తమకు తగిన శాస్తి జరిగిందని వాపోయారు.

నమ్మితే.. అంతే

ఎన్నికల సమయంలో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. బాబు నమ్మితే అంతే అని, నట్టేట్లో మునిగినట్టేనని వివరించారు. ఇప్పటికి మూడుసార్లు అధికారంలోకి వచ్చినా ఏనాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. గత ఎన్నికల్లో సూపర్‌సిక్స్‌తో పాటు జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ హామీలను అందిస్తానంటూ గొప్పలు చెప్పి మోసగించిన ప్రజాద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారం ఏడాది కాలంలో ఒక్కో కుటుంబానికి రూ.60వేల నుంచి రూ. 1.50లక్షల వరకు లబ్ధి చేకూర్చాల్సి ఉంటుందని వెల్లడించారు. అయితే ఒక్క రూపాయి కూడా ప్రజలకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న లక్షల మంది నిరుద్యోగులను దగా చేశారని ఆరోపించారు. కనీసం రూ.3వేల నిరుద్యోగ భృతి సైతం అందించకుండా యువతను ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తన కుమారుడు లోకేష్‌కు మాత్రం మంత్రి ఉద్యోగం కల్పించారన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకత ఇప్పటి వరకు మరే పార్టీపై రాలేదని తెలిపారు. చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్, అనీష్‌రాయల్, తమ్ముడు గణేష్, తాజిన్, ఈశ్వరి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, నేతలు తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, తలారి రాజేంద్ర, జీవరత్నంరెడ్డి, తులసీయాదవ్, అజయ్ కుమార్, పెరుగు బాబూయాదవ్, మద్దాలి శేఖర్, కుప్పయ్య, పసుపులేటి సురేష్, అనీల్, జీవకోన రెడ్డప్ప పాల్గొన్నారు.

'వెటర్నరీ' అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతి సిటీ : దళిత అధ్యాపకుడిని అవమానిస్తే పట్టించుకోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ అధికారుల తీరు సరికాదని అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపాక దాము ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈమేరకు దళిత సంఘాల నేతలతో కలిసి వెటర్నరీ వర్సిటీ వీసీ రమణను నిలదీశారు. వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. అగ్రవర్ణ ఉద్యోగుల పోకడలు దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. అధ్యాపకుడు రవివర్మను అవమానించిన తీరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైనా, కారకుడైన రవీంద్రరెడ్డిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశఋరు. కోర్టు ఉత్తర్వులను సైతం అధికారులు అమలు చేయకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నకిలీ సర్టిఫికెట్లతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పదవిలో కొనసాగుతున్న కిరణ్ బాబును, డెయిరీ కళాశాలలో దళితులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న సూపరింటెండెంట్ బాల కార్తీక్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో చాలా మంది ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, ప్రమోషన్‌లు పొందారని, వారిని వెంటనే గుర్తించి విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. లేకుంటే దీనిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



వీసీకి వినతి పత్రం అందిస్తున్న దళిత నేతలు

దాహార్తిని తీర్చడమే లక్ష్యం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట పంచాయతీ మఠం భూముల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారికి తాగునీరు అందించి దాహం తీర్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. మఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారిలో సుమారు 200 మందికి పైగా పంచాయతీకి పన్నులు కడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఇదివరకే మండల మీట్‌లో జెడ్పీటీసీ సభ్యులు రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు బుజ్జమ్మ పలుమార్లు ప్రస్తావించినట్టు గుర్తుచేశారు. పన్నులు వేసి, ఓటరు జాబితాలో స్థానం కల్పించిన తర్వాత కూడా తాగునీరు సరఫరా చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. ఓట్లు వేయించుకున్న నేతలు ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదని స్పష్టం చేశారు. నిబంధనలను పక్కన పెట్టి మానవత్వంలో ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. అలాగే కుంట్రపాకం, ఓటేరు, పాతకాల్వ, పెరుమాళ్లపల్లి పంచాయతీల్లో కూడా నీటి సరఫరా కోసం బోర్లు, మోటారు, పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పేరూరు పంచాయతీలోని రాములవారి గుడి వద్ద సిమెంటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు.దీనిపై ఎంపీడీఓ రామచంద్ర మాట్లాడుతూ ఈ విషయాలను ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకు వెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమీక్షలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు హిమంత్ చౌదరి, హేమాద్రి, పీఆర్ ఏఈఈ ఉదయ్ కుమార్, తుమ్మల గుంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

గ్రీవెన్స్‌కు 43 వినతులు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 43 వినతులు వచినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 15 మంది తమ సమస్యలు తెలుపగా, 28 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించినట్లు వెల్లడించారు. ఆయా సమస్యలను సంబంధిత విభాగాలకు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్‌తోపాటు డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుద్ధ్యం

తిరుపతి తుడా : నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం మాధవ నగర్, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉదయం 6గంటలలోపే నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చెత్త కుప్పలు తొలగించాలన్నారు. వర్షాలు కురిసిన సమయంలో మురుగునీరు రోడ్లపైకి వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. తక్షణం ఆ కాలువలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో చెత్త, మట్టి లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని కోరారు. చెత్త తరలించే వాహనాల రాకపోకల సమయాలను నమోదు చేసిన రికార్డులను రిశీలించారు. డీఈ రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

ఎమర్జెన్సీ విభాగం పాత్ర కీలకం

తిరుపతి తుడా : రోగుల ప్రాణాలను కాపాడడంలో ఎమర్జెన్సీ విభాగం పాత్ర కీలకమని స్విమ్స్ వీసీ, డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. సోమవారం పద్మావతి ఆడిటోరియంలో 'సేవింగ్ లైఫ్స్ స్కేర్డ్ హైట్స్' అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. అతిథులు, వైద్యాధికారులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రోగులకు అన్ని పరీక్షలు నిర్వహించి త్వరితగతిన ప్రాణాలను కాపాడే క్రమంలో ఎంతో శ్రమతో పనిచేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. అతిథిగా విచ్చేసిన పబ్లిక్ హెల్త్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేషెంట్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి త్వరితగతిన చికిత్సను అందించడంలో ఎమర్జెన్సీ విభాగపు వైద్యుల కృషి వెలకట్టలేనిదని వెల్లడించారు. అనంతరం అత్యవసర చికిత్సలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ వనజాక్షమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ రామ్, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఉషా కళావత్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ మాధవి, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి కృష్ణసింహారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రకాష్ బాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో స్విమ్స్ డైరెక్టర్ తదితరులు

రాష్ట్రస్థాయి పోటీల్లో తిరుపతి క్రీడాకారుల సత్తా

తిరుపతి కల్చరల్: రాష్ట్రస్థాయి చాంపియన్ మోడ్రన్ పెంటథ్లాన్ లేజర్ రన్ 2025–26 క్రీడా పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చాటి, పతకాలు సాధించారని అథ్లెటిక్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌనిక తెలిపారు. గుంటూరు జిల్లా నర్సారావుపేటలోని కోడెల శివప్రసాద్ స్టేడియంలో ఈనెల 12,13 తేదీల్లో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. ఇందులో పురుషుల విభాగంలో తిరుపతికి చెందిన జి.పవన్ కల్యాణ్ రజిత పతకం, అండర్–19 విభాగంలో కె.పునీత్ కాంస్య పతకం, అండర్–15 విభాగంలో కె.మోహిత్ రజిత పతకం సాధించడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభతో సత్తా చాటిన ఈ క్రీడాకారులు ఆగస్టు నెలలో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ మోటివేటర్ కె.హరిబాబు, జిల్లాలోని పలువురు క్రీడాకారులను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కలెక్టరేట్‌కు వినతుల వెల్లువ



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



పొదుపు సంఘం సభ్యులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వినతులు వెల్లువలా వచ్చాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 301 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్‌తోపాటు డీఆర్వో నరసింహులు పలువురు డిప్యూటీ స్పెషల్ కలెక్టర్లు అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై 136 అర్జీలను అందుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలను స్వీకరించారు. పలు విభాగాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. చిన్న చిన్న పనుల కోసం కలెక్టరేట్‌కు వస్తున్నారని, ఇలాంటివి సచివాలయాల్లోను, తహసీల్దార్ కార్యాలయాల్లోను, ఎంపీడీవో కార్యాలయాల్లో పరిష్కరించాలని జేసీ పేర్కొన్నారు.

మా పొదుపు డబ్బులు ఇప్పించండి సార్

పొదుపు సంఘం డబ్బులు మా సంఘంతోపాటు పలు సంఘాలకు చెందిన వారు క్రమం తప్పకుండా కడుతున్నాం. అయితే మా ఆర్‌పీ లత ఆ డబ్బులు కట్టకుండా స్వాహా చేశారు. మొత్తం రూ.8 లక్షలు కట్టలేదు. దీంతో మా పరిస్థితి దయనీయంగా మారింది. మాకు న్యాయం చేయండి.

-భాగ్యలక్ష్మి పొదుపు సంఘం వారు, 3వ వార్డు, తిరుపతి

పోలీస్ కార్యాలయానికి 113 అర్జీలు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 113 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో చోరీలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.



ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు సమస్య విన్నవిస్తున్న అర్జీదారు

సరదాగా మిత్రులతో ముచ్చట్లు



మిత్రులతో భూమన కరుణాకరరెడ్డి, స్నేహితుడిని సత్కరిస్తూ..

తిరుపతి మంగళం : "ఏమబ్బా ఏంటి సంగతులు.. ఎలా ఉన్నారు" అంటూ చిన్ననాటి స్నేహితులతో సరదాగా వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ముచ్చటించారు. సోమవారం ఈ మేరకు తన మిత్రులు, ఉద్యమకారులు బాలకృష్ణమనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డిని కలిశారు. వారిని ఘనంగా సత్కరించారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు.

నోటీస్ బోర్డు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు టీటీడీ పరిపాలన భవనం వద్ద నిరసన కార్యక్రమం.
- కరకంబాడిలోని అమరరాజా ఆడిటోరియంలో ఉదయం 9.30 నుంచి పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం.
- స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవ వేడుకలు.

తహసీల్దార్‌గా మధుసూదన్‌రావు



రామచంద్రాపురం : మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సిబ్బంది సహకారంతో మరింత మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు.

జయలక్ష్మికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఎస్.జయలక్ష్మికి తంజావూర్‌లోని ప్రిస్ట్ వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ చాముండేశ్వరి పర్యవేక్షణలో 'రియల్ టైమ్ అప్లికేషన్ ఆఫ్ కేస్ స్టడీస్ ఆఫ్ బిగ్ డేటా అనలిటిక్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

సీఐటీయూ పాటలకు 'సుద్దాల' కలం



అశోక్ తేజతో సీఐటీయూ నేతలు

తిరుపతి కల్చరల్ : విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల సందర్భంగా పాటలను రచించేందుకు సుద్దాల అశోక్ తేజ రంగంలోకి దిగారు. సోమవారం ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కలిసి అశోక్‌తేజతో చర్చించారు.

ముదిరిన ఆలయ వివాదం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయ వివాదం ముదురుతోంది. ఈ క్రమంలో అమ్మవారికి జాతరను నిర్వహించాలని స్థానికులు నిర్ణయించారు. సోమవారం ఆలయ శుద్ధి, పెయింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. దీనిపై సమాచారం అందుకున్న సింగ్‌లు కొందరు మహిళలతో ఆలయం వద్దకు చేరుకుని ప్రధాన ద్వారానికి తాళం వేసేశారు. ఉత్సవాలు నిర్వహించేందుకు వీలు లేదని స్థానికులతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీఐ ఇమ్రాన్‌బాషా మాట్లాడుతూ మంగళవారం రెండు వర్గాలతో చర్చిస్తామని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు గొడవకు దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,193 మంది స్వామివారిని దర్శించుకోగా 33,298 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

16న ఆణివార ఆస్థానం

తిరుపతి కల్చరల్ : నగరంలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల్లో బుధవారం ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద , శ్రీకోదండరామాలయంలో గరుడాళ్వార్ ఎదుట ఆస్థానం చేపట్టనున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : మద్యం తాగి ఆటోలు నడుపుతున్న ముగ్గురికి రెండు రోజులు చొప్పున జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపారు. మరో 14 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.